

హైదరాబాద్ వార్త

# భూదాన్‌లో ఏకపక్షంగా చర్యలు?

-భూదాన్ స్థలాల్లో పదుల సంఖ్యలో నిర్మాణాలు
-ఓ సామాన్యుడి నిర్మాణం మాత్రమే కూల్చివేత
-బడాబాబుల భారీ షెడ్లకు మినహాయింపు
-అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



భూదాన్‌లో ఎటువంటి చర్యలు లేని బడాబాబుల భారీ షెడ్లు



సామాన్యుడి షెడ్డును కూల్చుతున్న దృశ్యం

**దుండిగల్, జులై 4 ప్రభాతవార్త:** పదుల ఎకరాల్లో భూదాన్ స్థలాలు ఉన్నాయి..సదరు స్థలాల్లో పదుల సంఖ్యలో నిర్మాణాలు...భారీ షెడ్లను నిర్మించి వివిధ వ్యాపార కలాపాలు కొనసాగుతుండగా రెవిన్యూ అధికారులు శుక్రవారం పనిగట్టుకొని ఒక్క నిర్మాణంపై మాత్రమే చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. పలుకుబడి ఉన్నోళ్ళ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి సమయాన్ని ఇచ్చిన అధికారులు సామాన్యులకు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే నేరుగా చర్యలు పూనుకోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ నిబంధనలు పలుకుబడి ఉన్నోళ్ళకు ఒకలా..లేనివాళ్ళకు ఒకలా ఉంటాయా అని పలువురు ప్రశ్నించిన అధికారుల వద్ద సమాధానం లేదు. దీంతో రాజకీయ పలుకుబడి లేదా ఉన్నతాధికారుల సహకారం ఉంటే ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆటంకం ఉందదు అనే విషయం స్పష్టమవుతున్నట్లు తెలుస్తుంది.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మదుండిగల మండలం, గాగిల్లాపూర్ ,దొమ్మరపోచంపల్లిలలో పదుల ఎకరాల్లో భూదాన్ స్థలాలు ఉన్నట్లు రెవిన్యూ రికార్డులు పేర్కోంటున్నాయి. ఇట్టి సర్వేనంబర్లలోని స్థలాలను ప్రోహైబిటెడ్ లిస్టులో ప్రభుత్వ స్థలాలు పేర్కోంటూ 22-ఏలో పొందుపరుస్తూ జిల్లా కలెక్టర్ 24-07-2024న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ఇట్టి స్థలాల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదని స్పష్టం అవుతుంది. అదే సమయంలో సదరు స్థలాల్లో వ్యవసాయం మినహా ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే ప్రభుత్వ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి భూదాన్ స్థలాల్లో పదుల సంఖ్యలో భారీ షెడ్లను నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

**సామాన్యుడిపై ప్రతాపం..**
**పలుకుబడి ఉన్నోళ్లకు సహకారం...?**

పలుకుబడి ఉంటే ఏదైనా సాధ్యమై అని మరోసారి రుజువైంది. భూదాన్ స్థలాల్లోని నిర్మాణాలపై చర్యల్లో భాగంగా శుక్రవారం అధికారుల తీరు ఇందుకు నిదర్శనంగా పేర్కోనవచ్చు. పదుల సంఖ్యలో నిర్మాణాలు ఉన్న ప్రాంతంలో ఒక్క నిర్మాణంపై మాత్రమే చర్యలు చేపట్టడం వెనుక అంతర్యం ఏమిటి..? నోటీసులు జారీ చేయకుండానే జెసిబిలు రావడం, కూల్చివేతలు చేయడం ఏమిటి..? కాగా దొమ్మరపోచంపల్లి భూదాన్ స్థలంలో పలుకుబడి ఉన్న వ్యక్తి 'ఒక ఎకరం' పైగా విస్తీర్ణంలో భారీ షెడ్లు నిర్మించారు. మున్సిపల్ అధికారులు ఇంటినంబర్ సైతం జారీ చేశారు. బడాబాబు షెడ్లకు నోటీసులు ఇచ్చి కావలసినంత సమయం ఇవ్వడంతో పాటు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో అధికారుల ద్వంద వైఖరి అర్థం చేసుకోవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే అధికార యంత్రాంగం తప్పనిసరిగా చర్యలు చేపట్టాల్సిందే. అయితే పలుకుబడి ఉన్నోళ్ళకు సహాకరిస్తాం..లేదంటే చర్యలు చేపడుతామనే ఏకపక్ష దోరణి సరియైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఇప్పటికైనా దొమ్మరపోచంపల్లి భూదాన్‌లో ఒక ఎకరంకు పైగా విస్తీర్ణంలో వెలసిన భారీ షెడ్లపైన చర్యలు ఉంటాయో లేదో చూడాలి.

**చర్యలు చేపడుతాం**
**: తహాసీల్దార్ సయ్యద్ మతీన్**

భూదన్ స్థలాల్లో నిర్మాణాలపై చర్యల గురించి తహాసీల్దార్ మతీన్ ను వివరణ కోరగా మండల పరిధిలోని భూదాన్ స్థలాలను అన్నింటిని పరిశీలిస్తున్నాము.వాటికి సంబంధించి నివేదిక ఇవ్వాల్సిందిగా మా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాము. భూదాన్‌లో నిర్మాణాలు అన్నింటికి నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.

# 'చెత్త' తీసేస్తున్నారు..

-నాలాల్లో పూడుకుపోయిన వ్యర్థాలపై హైడ్రా ఫోకస్
-కాలువ, కల్వర్టుల వెంట మాన్‌సూన్ బృందాల తనిఖీ
-చెత్త కనిపిస్తే వెంటనే జెసిబిల సహాయంతో తొలగింపు



**హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త:**
చెత్తతో నాలాలు పూడుకుపోయి కల్వర్టులు జామయ్యాయి.ఏకల్వర్టును కదిపినా టన్నుల కొద్ది చెత్త బయటపడుతోంది. కొన్ని చోట్ల నాలా ఆనవాళ్లే లేని పరిస్థితి. మ్యాన్‌హోళ్ల మూతలు తీస్తే.. ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో వర్షం నీరు వెళ్లే పరిస్థితి కనిపించడంలేదు. ఈనేపథ్యంలోనే హైడ్రా మాన్సూన్ బృందాలు నాలాలపై ఫోకస్ పెట్టాయి. ఎమర్జన్సీ టీమ్ (ఎంఈటీ)లు, హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు కలసి నాలాలు, కల్వర్టుల వద్ద పూడిక తీత పనులకు చేపట్టాయి. దీంతో కొన్ని చోట్ల టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త బయట పడుతోంది. యూసుఫ్‌గూడ పరసరాల్లోని మధురానగర్వ, కృష్ణానగర్ వద్ద వరద కాలువలో పేరుకుపోయిన చెత్తను హైడ్రా బృందాలు తొలగించాయి. అలాగే గచ్చిబౌలిలోని జనార్ధన్‌రెడ్డి నగర్‌లోని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను సైతం హైడ్రా తొలగించింది. కాప్రా సర్కిల్ వార్డు నెం.2 మార్కండేయ కాలనీలో నాలా క్యాచ్‌పిట్ ఏరియాలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అంతేకాకుండా ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో ఆర్‌సీఐ రోడ్డు, మిధిలానగర్ దగ్గర మంత్రాల చెరువు నుంచి జిల్లెలగూడ చెరువు కు వెళ్లే నాలాలో ఉన్న పూడికను హైడ్రా డీఆర్ ఎఫ్,ఎంఈటీ బృందాలు జేసీబీ ద్వారా తొలగించాయి.

**నాలా పనులకు ఆటంకాలు తొలగింపు..**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో వరద నీరు సాఫీగా సాగేందుకు ఉన్న ఆటంకాలను హైడ్రా తొలగించింది. నల్లగండ్ల చెరువు నుంచి వచ్చే వరద నీటి కాలువ పనులు ఇక జోరందుకోనున్నాయి. స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 2 కిలోమీటర్ల మేర ఈ వరద నీటి కాలువను నిర్మిస్తున్న విషయం విధితమే. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురయ్యింది. కొన్ని చోట్ల ఇంటి యజమానులు ముందుకొచ్చి ఆక్రమణలను తొలగించగా.. మరి కొంత మంది అభ్యంతరాలు తెలిపారు. దీంతో నాలా పనులు ముందుకు సాగడం కష్టంగా మారింది. ఈ తరుణంలో ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు నిర్వాహకులు హైడ్రాను ఆశ్రయించారు. ఇదే సమయంలో నీటి ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి కూడా స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 2 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉన్న నాలా కేవలం.. 230 మీటర్ల మేర పూర్తయ్యింది. దీంతో నల్లగండ్ల హుడా కాలనీలో సమస్య తలెత్తింది. ఒక అపార్టుమెంట్ ప్రహరీతో పాటు కొంత నిర్మాణం నాలాపైనే ఉంది. ఇదే మాదిరి మరి కొన్ని చోట్ల కూడా సమస్య తలెత్తడంతో శుక్రవారం హైడ్రా రంగంలోకి దిగింది. నాలా పరిధిలో ఉన్న నిర్మాణాన్ని తొలగించింది. నాలాకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి పనులు జరిగేందుకు అవకాశం కల్పించింది. నల్లగండ్ల చెరువు నుంచి మొదలై.. డాక్టర్స్ కాలనీ, రైల్ విహార్, నల్లగండ్ల హుడా కాలనీ, ఓల్డ్ శేరిలింగంపల్లి విలేజ్, నేతాజీనగర్ మీదుగా.. బీహెచ్ఈఎల్ చౌరస్తా వద్ద ఉన్న ప్రధాన నాలాలో ఈ నాలా కలుస్తుంది. నాలా ఆక్రమణలకు గురవ్వడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో నీట మునిగే ముప్పు ఈ కాలనీలకు తప్పుతోందని స్థానికులు సంతోషం వ్యక్తంచేశారు. ఆటంకాలు తొలగాయి కనుక..ఎస్ ఎన్ డీపీ నిర్వాహకులు ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

# అంటు వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరం

-ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి
-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్, రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త:**
అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. ఈమేరకు శుక్రవారం గ్రేటర్ లో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మెడికల్ అండ్ హెల్త్, అనుబంధ శాఖల అధికారులతో వర్క్ షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు ముఖ్యమని అన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత త్రాగు నీరు ప్రజలు పాటించాలన్నారు. ఇప్పటి వరకు వెక్టార్ బర్న్ వ్యాధులు డెంగ్యూ, మలేరియాతో పాటుగా సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. వెక్టార్ బర్న్ వ్యాధి కట్టడికి ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు ఇంటర్ డిపార్ట్మెంట్ సహకారం అవసరం అని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఏ ఎన్ ఎం ఆశా వర్కర్, అంగన్వాడి టీచర్ తో పాటు స్వయం సహాయక సంఘం గ్రూప్ ఎడ్ సభ్యులు ఉంటారు వారందరూ ఐఈసి కార్యక్రమాలు చేస్తారని గ్రేటర్ లో కూడా అదే పద్ధతిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ మాట్లాడుతూ అర్బన్ మలేరియా క్రింద ఫీవర్ సర్వే, ఏఎల్ఓ, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టినట్లు వివరించారు. దోమల నివారణకు ఫాగింగ్ రోజుకు ఒక వార్డు చొప్పున 150 వార్డులలో చేస్తున్నట్లు ఈ ఫాగింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందని, కళాశాల, హై స్కూల్ విద్యార్థులకు ఐఇసి కార్యక్రమాలు చేపట్టినటు వివరించారు. హైదరాబాద్ డిఎంహెచ్‌వో డా.వెంకటి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో సెప్టెంబర్ మాసం ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదు అవుతుందని, యాంటీ లార్వా ప్రోగ్రామ్ ఎక్కువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా మాట్లాడుతూ... రాపిడ్ ఎమర్జెన్సీ లోను హైరిస్కియలో ఏర్పాటు చేశామని జిహెచ్ఎంసితో కలిసి య్యాక్టర్ బోర్న్ వ్యాధులను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని అందుకోసం క్రియేటివ్ టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సుభద్ర, ఉస్మానియా యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ జె వెంకటేశ్వరరావు, ఐఐసిటిసైంటిస్ట్ కె.లక్ష్మీ నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మొహరం సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు : సిపి సివి ఆనంద్



బీబీకా ఆలంను సందర్శించిన సీపీ సివి ఆనంద్

**చార్మినార్,జూలై 4 ప్రభాతవార్త :** మొహరం సంతాప దినాలను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్,డిజి సీవీ ఆనంద్ తెలిపారు.మొహరం ఎనిమిదివ రోజు సందర్భంగా శుక్రవారం ఆయన పాతబస్తీ డబీర్‌పురలోని బీబీకా ఆలంను సందర్శించి పుష్ప గుచ్చాలు,దట్టీలు సమర్పించారు.మొహరం సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు,భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ సివి ఆనంద్ మాట్లాడుతూ మొహరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం తరుపున మంత్రులు,షియా మత పెద్దలు,పోలీస్,ఇతర శాఖల అధికారులతో అనేక సమన్వయ సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు.మొహరం ఊరేగింపు శాంతియుత వాతావరణలో జరిగే విధంగా 3000 వేల మందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేయటం జరిగిందని ఆయన తెలియజేశారు. మొహరం ఊరేగింపును పురస్కరించుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఆయన తెలియజేశారు.ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ట్రాఫిక్ డిసిపిల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.10వ మొహరం ఊరేగింపు మార్గాలను ఆయన సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా,ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లు,ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ప్రశాంతమైన వాతావరణలో మొహరం ఊరేగింపు జరిగే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు.ప్రజలు కూడ పోలీసులకు సహకరించి మొహరం వేడుకలు శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా సహకరించాలని సీపీ సివి ఆనంద్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు,సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మెహర్ బాబా కాలనీ రోడ్డును పరిశీలించిన హైడ్రా కమిషనర్



**నేరెడ్ మెట్, జులై 4ప్రభాతవార్త :** నేరేడ్మెట్ డివిజన్ యాప్రాల్ మెహర్ బాబా కాలనీలోని రోడ్డును అక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని హైడ్రా కమిషనర్ రంగానాథ్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో ప్రజలకు చెందిన రహదారి కబ్జాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వెంటనే రోడ్డు సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. అయితే ఇక్కడి రోడ్డు కబ్జాలను మున్సిపల్ అధికారులు గతంలో రెండు సార్లు తొలగించినా , రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టవిషయాన్ని హైడ్రా కమిషనర్ కు కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు కిష్ణమూర్తి, భాస్కర్ రెడ్డిలు వివరించారు. కాలనీలో నెలకొన్న రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కిష్టారెడ్డి, ప్రసాద్, ఉదయ్, రాజశేఖర్, రాంబాబు, డా.శ్రీనివాస్, ప్రసాద్ రెడ్డి, పి. కిష్టారెడ్డిలతో కాలనీవాసులు అధికారులను కోరారు. త్వరలోనే ఇక్కడి రోడ్డు సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతామని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. హైడ్రా అధకారులతో పాటు మున్సిపల్, పోలీసుల శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో ఆర్టీసి సంస్థలు

**చిక్కడపల్లి, జూన్ 4 ప్రభాతవార్త:**



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాల వల్ల దేశంలోని అన్ని ఆర్టీసిలు తీవ్రమైన సంక్షోభంలోకి నెల్లబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్టీసి బస్ భవన్ వద్ద ఆర్టీసి తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఎఐటి యుసి(ఈయు), ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు, ఐఎన్‌టియుసి, బిడబ్ల్యుయు, బికెయు, కెపి, ఐఎన్‌టియుసి తదితర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించతల పెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసి టిఎంయు ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలోని 125వ సవరణ ద్వారా ఆర్టీసిలకు కల్పించిన ప్రత్యేక హక్కులను ఎంవి యాక్ట్-2019 ద్వారా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. టూరిస్ట్ పర్మిట్ విధానం తీసుకువచ్చి ఆర్టీసీలకు పోటీగా వేలాది వాహనాలను స్టేజీ క్యారేజీలుగా తిప్పుతూ ఆర్టీసి ఆదాయాలను కొల్లగొట్టేందుకు అవకాశం కల్పించారన్నారు. ఆందోళనలు చేయకపోతే ఆర్టీసిలు, ఆర్టీసి కార్మికులు కూడా మిగిలే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు జి.అబ్రహం, వేణుగోపాల్, జకరియా, వివిఎస్.రావు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో నరకం..!

-రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు గంటన్నర సమయం
-విలువైన సమయం వృథా..పడిపోతున్న వాహనాల మైలేజీ
-తీవ్రతరంగా ట్రాఫిక్ రద్దీ ...చోద్యం చూస్తున్న యంత్రాంగం



**హైద్రాబాద్, జూలై 4 ప్రభాతవార్తః**
నగరవాసులకు శుక్రవారం నరకం కనిపించింది. 'రాజకీయ' పర్యటనల నేపథ్యంలో హడావుడి నెలకొంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నగరంలో పర్యటించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నగరానికి వచ్చారు. అదే సమయంలో మాజీ సిఎం కెసిఆర్ సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో ఉండడంతో బిఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్డీకాపూర్ చౌరస్తాలో మాజీ ఎంసి రోశయ్య విగ్రహా విష్కరణ చేశారు.దీంతో..నగరంలో ఎటు చూసినా రాజకీయ కోలాహలం నెలకొంది. అందుకు తగ్గట్లే పోలీసులు మోహరించారు. నేతల రాకపోకల నేపథ్యంలో వాహనదారులూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు వాహనదారులు.

**నరకప్రాయంగా ట్రాఫిక్ సమస్యలు..**

మహానగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఎన్ని ఆకాశమార్గాలు నిర్మించినా ఫలితం ఉండటం లేదు. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్ ఆగిపోతున్నా కొన్ని చౌరస్తాల్లో ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదు. కనిపించినా కేవలం ట్రాఫిక్ పెండింగ్ ఛలాన్ల తనిఖీలకు, ట్రాఫిక్ ఉల్లంఘించిన వాహనాల ఫొటోలు తీయడానికి పరిమితం అవుతున్నారు.దీంతో ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించుకొని ఇంటికి చేరాలంటే పద్మ వ్యూహాన్ని ఛేధించినంతగా శ్రమించాల్సి వస్తోంది. ట్రాఫిక్ జామ్‌లను నివారించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఛలాన్‌లు విధించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలను చేసినా ట్రాఫిక్ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. చాలా వరకు ప్రధాన రోడ్లన్ని వాహనాలతో నిండిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి గమ్యస్థానాలు చేరుకోడానికి రెండు, రెండున్నర గంటల పాటు ఇబ్బందులు పడకతప్పడం లేదు. వాహనాలు రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు కనీసం గంటన్నర సమయం పడుతుందంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. దీంతో వాహనాల విలువైన సమయం వృథా కావడంతో పాటు గమ్యం చేసేవరకు రోడ్ల వాహనాల ఇంజన్ ఆన్‌లో ఉండడంతో పెట్రో డీజిల్ ఆవిరైపోతున్నాయి.

**గతంలో ఎన్నడూలేనంతగా..**

నగరంలో నిత్యం కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. అవన్నీ రెండు మూడు గంటల్లోపు సాఫీగా మారతాయి.ఇటీవల ఎన్నడూ కనిపించని ట్రాఫిక్ సమస్య ఇటీవల తీవ్రరూపం తలెత్తుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏ మార్గంలో వెళ్లినా కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయి కనిపించాయి. మాదాపూర్- జూబ్లీహిల్స్- బంజారాహిల్స్, మెహిదీపట్నం- మాసాబ్‌ట్యాంక్, అసెంబ్లీ- అబిడ్స్, హబ్సిగూడ-నాచారం తదితర ప్రాంతాల్లో సాయంత్రం వరకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. అమీర్‌పేట్-పంజాగుట్ట-ఖైరతాబాద్-లక్డీకాపూల్, మలక్‌పేట్-దిల్‌సుఖ్‌నగర్, మెట్టుగూడ- తార్నాక- ఉప్పల్-మేడిపల్లి, బేగంపేట్-రసూల్‌పురా- సికింద్రాబాద్- మినిస్టర్‌రోడ్, బేగంబజార్- చార్మినార్ లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యం అయ్యియి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే దాదాపు రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. గతంలో పండుగలు, ఆదివారాలలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. కాని ఇప్పుడు దానికి భిన్నంగా తయారైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడినా అవి గంట సమయంలోనే సాఫీగా మారతాయి. వర్షాకాలం వస్తే మాత్రం ఎప్పటికి ట్రాఫిక్ క్లీయర్ అవుతుందో చెప్పలేని పరిస్థితి.

# శాఖాంబరీ ఆలంకారంలో శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు..



శాఖాంబరీ అలంకారంలో శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు.

**బేగంపేట జులై 4,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో శుక్రవారం మినీ జాతరను తలపించింది.అమ్మవారు శాఖాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.కొంత మంది భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించగా మరికొంత మంది అమ్మ వారికి ఒడిబియ్యం సమర్పించారు.వీరితో పాటు జంట నగరాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు.ఆషాడ బోనాల జాతర సమీపిస్తుండటంతో అమ్మ వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ప్రధాన ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు భక్తుల రద్దీతో కిట కిట లాడాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.అమ్మ వారికి శాఖాంబరీ అలంకారం కోసం 2.5టన్నుల (2వేల 500కిలోలు) వివిధ రకాలైన కూరగాయలతో దేవాలయం మొత్తం అలంకారం చేసారు.అత్తెల్లి కుటుంబం నుంచి తొలిబోనం సమర్పించారు.శుక్రవారం ఘటం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం నుంచి బయలు దేరి ఓల్డ్ బోయిగూడాకు ఉదయం గం 9లకు బయలు దేరి తిరిగి దేవస్థానానికి రాత్రి గం 9లకు చేరుతుంది.భక్తులు అధిక సంఖ్యలో హాజరై శాఖాంబరీ దేవి గా ఉన్న మహంకాళీ అమ్మ వారిని దర్శించుకున్నారు.

## పీర్ల పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**మల్కాజిగిరి జూలై4,ప్రభాతవార్త :**
మోలాలి లో షియా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధ లతో నిర్వహించే పీర్ల పండుగ కు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరైయ్యారు.పీర్లకు దట్టి కట్టి పీర్లను ఎత్తుకొని సంతోషంగా వేడుకల్లో పాల్గొన్నారు.మొహరం పండుగ సందర్భంగా షియ ముస్లింలు సంతోషంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, జేసీ వెంకన్న, రాముయాదవ్ ఉస్మాన్, సత్యనారాయణ ,వంశీ, నవాబు, దినేష్, రాజశేఖర్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు షియా ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నేతలు



**మల్కాజిగిరి జూలై4,ప్రభాతవార్త :**
ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీ కార్పొరేటర్ కార్యాలయం నుండి కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు మైనంపల్లి హనుమంతరావుతో కలిసి డివిజన్ నుండి ర్యాలీగా తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు సత్యనారాయణ సంపత్ రావు గుండా నిరంజన్ రాందాస్ సంతోష్ ముదిరాజ్ ఉపేందర్ బ్రహ్మయ్య శంకర్ రావు, మోహిన్,మోసిన్ రాము , తదితరులు పాల్గొన్నారు

## అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

### న-వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



బీబీకా ఆలంకు దట్టీలను సమర్పిస్తున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,జూలై 4 ,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మొహరం పండుగను పురస్కరించుకుని డెబిల్ పూరాలోని ప్రముఖమైన బీబీకాఆలం కు ఆయన దట్టిలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యం పెంపొందించడానికి ఇటువంటి పండుగలు ఎంతగానో దోహదపడుతుయని తెలిపారు. ప్రజలందరూ కలిసిమెలిసి శాంతితో వాతావరణంలో ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సార్ అందులో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ అస్గర్, అలీబేగ్, సయ్యద్ అమర్ హుస్సేనీ, రమిజ్ ముస్తఫా, సలీం అలీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ ఉద్యోగిపై జరిగిన దాడిని ఖండించిన టిఎన్జీవోఎస్ కేంద్ర సంఘం



మంత్రి తుమ్మల నాగేశ్వరావు కలిసి సంఘటన గురించి వివరిస్తున్న టీఎన్జీవోఎస్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, సహ అధ్యక్షులు వెంకటేశం , సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి తదితరులు

**మలక్ పేట ,జూలై 4 ప్రభాతవార్త:** వ్యవసాయ మార్కెట్ కమిటీ మహబూబ్ నగర్ కార్యదర్శి భాస్కర్ పై వైస్ చైర్మన్ విజయ్ కుమార్ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్జీవోస్ ప్రధాని కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, సహ అధ్యక్షులు వెంకటేశం, సెంట్రల్ ఫోరం యూనియన్ అధ్యక్షులు చిలక నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మూకరం లు పేర్కొన్నారు. టీఎన్జీవోఎస్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో వారు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ను కలిసి జరిగిన సంఘటన గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ పై దాడికి పాల్పడిన వైస్ చైర్మన్ విజయ్ కుమార్ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు సురేంద్రమోహన్ ను వారు కలిసి సంఘటన గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, అశోక్, శ్రీనివాస్ , వెంకట్ రెడ్డి,విజయ్ కిషోర్ , రేవంత్, శ్రీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యం: చేకోలేకర్ శ్రీనివాస్



మలక్ పేట్ నుంచి ర్యాలీగా తరలుతున్న చేకోలేకర్ శ్రీనివాస్, చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ, డైరెక్టర్లు కిషన్ సింగ్ ,సుప్రియ తదితరులు

**మలక్ పేట ,జూలై 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభకు చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కలిసి మలక్ పేట నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, డైరెక్టర్లు కిషన్ సింగ్, సుప్రియ, నాయకులు మహేష్ కుమార్, రాహుల్ సింగ్, చక్రపాణి, షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్కలను తొలగించేందుకు చర్యలు : ఎమ్మెల్యే బీఎల్ఆర్



డ్రోన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ చిత్రంలో కార్పొరేటర్

**నాచారం, జులై 4 ప్రభాతవార్త :** నాచారం ఎర్రకుంట పటేల్ కుంట చెరువులో విపరీతంగా గుర్రపు డెక్క పెరగడంతో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇదే విషయమై నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్,బాబా నగర్ ఎర్రకుంట రామి రెడ్డి నగర్ నాచారం ప్రజలు ఎమ్మెల్యేకి దృష్టికి తీసుకు రావడం జరిగింది.తక్షణమే జోనల్ కమిషనర్ తో మాట్లాడి అలాగే ఎంటమాలజీ అడిషనల్ కమిషనర్ పంకజ తో మాట్లాడి చెరువులో పూర్తిగా పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించాల్సిందిగా ఎమ్మెల్యే ఉద్దేశించారు. అందులో భాగంగా టెండరు ప్రక్రియ పూర్తి చేసుకొన్న డ్రోన్ యంత్రానికి ముందుగా పటేల్ కుంట చెరువు వద్ద ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ లు కొబ్బరికాయ కొట్టి పనులను శుక్రవారం ప్రారంబించారు. డ్రోన్ యంత్రంతో ఏర్బిసైడ్ ద్రావణం పిచికారి పనులు ప్రారంభించడం పిచికారీ చేసిన వెంటనే గుర్రపు డెక్క పూర్తిగా ఎండిపోతుందని దీనివల్ల దోమల సమస్య తగ్గుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తొందరలోనే పటేల్ కుంట చెరువులోకి వస్తున్న మురుగునీటిని డైవర్షన్ చేయడానికి ఏర్పాటు చేసిన పైప్లైన్ పనులను పూర్తి చేయించి చెరువులోకి మురుగునీరు రాకుండా చేస్తామని తెలియజేశారు.అలాగే హెచ్ఎంటి నగర్ చెరువు వలే పటేల్ కుంట చెరువు చుట్టూ కూడా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేసి వాకింగ్ చేసుకునేందుకు వీలు ఉండేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.మరో వారం రోజుల్లో పటేల్ కుంట చెరువులోకి ఎఫ్ టి సి యంత్రాన్ని తీసుకువచ్చి చెరువులోని గుర్రపు డెక్కన్ పూర్తిగా తీపిస్తామని కార్పొరేటర్ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ బారాస పార్టీ ఇన్చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, బారాస రాష్ట్ర నాయకులు సాయి జన్ శేకర్, ఎంటమాలజీ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ స్నాతకోత్సవం




కాన్వకేషన్ సర్టిఫికేట్లు అందజేస్తున్న ఉస్మానియా యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్

**సైదాబాద్, జులై 4 ప్రభాతవార్త:** మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఉస్మానియా యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ అన్నారు. సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో 'హొరిజాన్' పేరిట నిర్వహించిన స్నాతకోత్సవం, డిగ్రీ ప్రథమ సంవత్సర విధ్యార్థుల పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సాధికార సాధించాలన్నారు. ప్రతి ఒక్కరు నిరంతర విద్యార్థిగా ఉండాలని, చదువులో నూతన విషయాలను అందిపుచ్చుకున్నప్పుడే నేటి సమాజ అవసరాలను తీర్చగలగుతామని అన్నారు. విద్యార్థులు అబ్దుల్ కలాం, నెల్సాన్ మండేలా జీవితాలను స్పూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. స్కిల్ యూనివర్సిటీతో విద్యారంగంలో పెను మార్పులు రానున్నాయని అన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తాము ఎంచుకున్న రంగంలో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సమాజ అవసరాలు, మార్పులకు అనుగుణంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం కొత్త కోర్సులకు రూపకల్పన చేస్తుందన్నారు. గ్రంధాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే తప్పని సరిగా వార్తా పత్రికలు చదవాలని, గ్రామీణ విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ ఎస్.వి.ప్రకాష్, సక్సెస్ గ్రూప్స్ చైర్మన్ పార్థసారథి, ప్రిన్సిపాల్ నిర్మల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య సాహసం నేటి తరానికి స్ఫూర్తిదాయకం



బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు లవంగి రాజు ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న నేతలు

**తుర్కయంజాల్ జూలై 4,ప్రభాతవార్త :**
తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి, ఆయన సాహసం నేటి యువతకు ఆదర్శమని తుర్కయంజాల్ మున్సిపాలిటీ బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాగర్ హైవే చౌరస్తా లో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్నం రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి నడిపించి తెలంగాణ కొరకు పాటుపడిన దొడ్డి కొమరయ్యా ను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి జయంతి, వర్ధంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మల్లెల రఘు, మాజీ కార్యదర్శి జంతుక సైదులు, కోహెడ సెక్టార్ అధ్యక్షుడు శీలం ఆంగద్ కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్ డిపో వద్ద**

**మేడిపల్లి, జులై 4 ప్రభాతవార్త ;** తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 79వ వర్ధంతి ఉప్పల్ డిపో వద్ద ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ కౌడె పోచయ్య కురుమ ,యువ చైతన్య సమితి రాష్ట అధ్యక్షులు గొరిగె నర్సింహా కురుమ దొడ్డి కొమురయ్య కురుమ మరణించి 79 సంత్సరాలు అయిన తగిన గుర్తింపు దక్కలేదు అన్నారు. గత సంవత్సరం వర్ధంతి సభలో మంత్రి వెంకట్ రెడ్డి వచ్చే వర్ధంతి వరకు హైద్రాబాద్ లో విగ్రహం ఏర్పాటు చేస్తాము అన్నారు. ఇప్పటి వరకూ మొదలు పెట్టలేదు ఎప్పటికైనా ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చెయ్యాలి జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ సలహాదారులు నోముల ప్రసన్న కుమార్ కురుమ, రాష్ట కార్యదర్శి కెమిడి సత్యనారాయణ కురుమ, మేడిపల్లి మండల జనరల్ సెక్రెటరీ ఒరిగంటి భాస్కర్, కోశాధికారి చిందం రాజు, ఉపాధ్యక్షుడు మరాటి వెంకటేష్, గణేష్ నగర్ అధ్యక్షులు సోమలింగం, చెంగిచెర్ల అధ్యక్షులు పర్వతాలు, చండీశ్వర కురుమ సంఘం అధ్యక్షులు జోగు సోమయ్య, పార్వతి నగర్ అధ్యక్షులు జోగు సోమేష్,మల్లికార్జున నగర్ అధ్యక్షులు క్రరే శ్రీనివాస్, చెంగిచెర్ల అధ్యక్షులు కడకంచి కిరణ్ పాల్గొన్నారు



దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కౌడె పోచయ్య కురుమ , గొరిగే నరసింహ్మా కురు మతదితరులు

## దేశ భద్రత, సైనికుల ఆరోగ్యాలు బాగుండాలని దేశ పౌరులు కోరుకోవాలి



మహిళలతో కుంకుమార్చన చేయిస్తున్న విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ తెలంగాణ ప్రాంత మహిళాధ్యక్షురాలు శోభారాణి: చిత్రంలో రాజ్పుత్ రజని, మహిళలు ఉన్నారు

**సరూర్నగర్, జూలై 4 ప్రభాతవార్త:** భారతదేశంలో నివసించే పౌరులందరూ దేశ రక్షణ, భద్రత, క్షేమాన్ని అదే విధంగా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశాన్ని అహోరాత్రులు కాపాడుతున్న సైనికుల మేలును కాంక్షించాలని విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ తెలంగాణ ప్రాంత మహిళాధ్యక్షురాలు, హూమన్ రైట్స్ ఫ్యామిలీ కౌన్సిలర్ శోభారాణి పిలుపునిచ్చారు. బాలాపూర్ మండలం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ గాయత్రీనగర్లోనున్న గణపతి, మానసాదేవి, శివ, గాయత్రీదేవి మందిరాల సహిత శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన, హనుమాన్, లలితా సహస్ర, లక్ష్మీ అష్టోత్తర పారాయణాలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా జరిగిన సందర్భంగా దేశ క్షేమం, సైనికులకు ఆయురారోగ్యాలు, శక్తి సామర్థ్యాలు ఇవ్వాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ సామాజిక సరరసత అభియాన్ ఆధ్వర్యంలో దాదాపు 150 మందికి పైగా మహిళలు ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంచి కామకోటి పీఠానికి చెందిన లక్ష్మీరూపం నాణాలలతో పాటు కుంకుమ, పూలు తదితర పూజా సామాగ్రిని మహిళలకు ఉచితంగా అందజేశారు. పూజలు, పారాయణల అనంతరం శోభారాణి మాట్లాడుతూ దేశ దుర్భేద్యంగా ఉంటేనే పౌరులందరూ క్షేమంగా ఉంటారనీ ఈ నేపథ్యంలో మన దేశ భద్రత, రక్షణ కోసం మనమంతా పూజలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా రాత్రింబవళ్లు సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణకు, పౌరులు ప్రశాంతంగా ఉండడానికి కవచంలా నిలుస్తున్న భారత సైనికులందరూ ఆరోగ్యాలతో ఉండాలని అందరూ కోరుకోవాలని ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో దశలవారీగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శోభారాణి వెల్లడించారు. జిల్లెలగూడ గాయత్రీనగర్లో జరిగిన పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు రాజ్పుత్ రజని, సునంద లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## నేటి యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రేమ్మహేశ్వర్రెడ్డి

**ఎల్బినగర్, జూలై 4 ప్రభాతవార్త:**
పాశ్చాత్య దేశాల్లో భారతీయతత్వాన్ని బోధించి, తన ఉపన్యాసాలతో ప్రపంచాన్ని జాగృతం చేసిన మహోన్నత అధ్యాత్మికవేత్త స్వామివివేకానంద నేడు యువత ఆదర్శంగా తీసుకోవాలని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్మహేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. స్వామివివేకానంద వర్ధంతి సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో వివేకానందనగర్ బస్టాప్వద్ద వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వామివివేకానంద భారత సంస్కృతి, ధర్మం, యువత శక్తిని అంతర్జాతీయ స్థాయిలో వెలుగులోకి తీసుకొచ్చిన మేధావి అని ఆయన ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శిగా నిలుస్తాయన్నారు. మన దేశ భవిష్యత్తు, వికాసం యువత చేతుల్లోనే ఉందని, ఆయన ఆధ్యాత్మిక దార్శనికతను అనుసరిస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చిలకూరి రామ్రెడ్డి, ఆనంద్కుమార్, ఓంకార్, వెంకటేష్ చారి, శ్రీధర్రెడ్డి, కేశక్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, సుజాత, రూపుల, శివరామ్, శ్రీకాంత్, సిరిరెడ్డి, వినయ్, గిరీష్, వంశీ, టీంకు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కృష్ణయ్య ఉద్యోగ విరమణ



ఉత్తమ ఉపాధ్యాయుడు మారోజు క్రిష్ణయ్యని సన్మానిస్తున్న మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ,మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తదితరులు

**మేడిపల్లి, జూన్ 4 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎ బయోసైన్స్ ఉపాధ్యాయులుగా సేవలందించిన, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మారోజు కృష్ణయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఎం కన్వేన్షన్ నందు ఘనంగా అభినందన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి,మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొని కృష్ణయ్య కు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మారోజు కృష్ణయ్య నిరంతర సేవలు,విద్యార్థుల ప్రగతికి చేసిన కృషి అందరి ప్రశంసలను పొందింది.విద్యా రంగంలో ఆయన చేసిన సేవలు మరింత మంది ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ,ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### గౌతమీ నగర్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో అరవింద్ రెడ్డి,గౌతమి నగర్ నగర్ ప్రతినిధులు

**వనస్థలిపురం జులై.4.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్లోని గౌతమీ నగర్ కాలనీలో ఓపెన్ జిమ్,స్ట్రాం వాటర్ డ్రైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందులకు బి.ఆర్.యస్.పార్టీ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో గౌతమీ నగర్ కాలనీ ప్రతినిధులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే,పరిష్కారానికి కృషి చేస్తానన్నారు, ఎమ్మెల్యే ను కలిసిన వారిలో గౌతమీ నగర్ ప్రతినిధులు సుధాకర్ గౌడ్,నారాయణ రావు, కిషన్,గోపీచంద్, భాస్కర్ గౌడ్,శ్రీహరి రెడ్డి,ఆంజనేయులు, జగన్,రామారావు, మారేశ్వర రావు తదితరులు ఉన్నారు.

### వైదేహినగర్లో దశలవారీగా అభివృద్ధి పనులు : కార్పొరేటర్



డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. జులై.4.ప్రభాతవార్త :** డివిజన్ లో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడతామని బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వైదేహీనగర్ రోడ్ నెంబర్ 4/1.లో నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ ల నిర్మాణపు పనులను కాలనీ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు.అనంతరం వైదేహీనగర్ లో సాయి బాబా ఆలయం నుండి శివాలయం వరకు నిర్మిస్తున్న సి.సి రోడ్డు పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దశలవారీగా డివిజన్ లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.కాలనీవాసుల కు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరివెన్నెల, కాలనీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి,మల్లేశం,వెంకటేశ్వర్లు, శివరాంప్రసాద్, బయన్న,జంగారెడ్డి,రామన్ చౌదరి, వినోద్, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### పసుపు కొమ్ములతో వారాహి అమ్మవారికి అర్చన



అమ్మవారి పూజలో పాల్గొన్న పున్న నిర్మలాగణేష్నేత దంపతులు

**ఎల్బినగర్, జులై 4 ప్రభాతవార్త:**
వారాహి నవరాత్రుల బ్రహ్మోత్సవాల సందర్భంగా వారాహి అమ్మవారికి పసుపు కొమ్ములతో అర్చన నిర్వహించారు. ఆర్కేపురంలోని కుర్తాళం శ్రీసిద్దేశ్వరి పీఠ విభాగ ఆదిపరాశక్తి శ్రీవారాహి పత్సంగిరా పరమేశ్వరి దేవాలయంలో భక్తుల కోలాహలం మధ్య ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి పసుపుకమ్ముల అర్చన కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మలా గణేష్నేత దంపతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జెల్ల జగన్నాథం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సంపత్ శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, శివ, అభినవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### మినీ వ్యాన్ ఢీకొని వృద్ధురాలి మృతి

**హయత్ నగర్, జులై 4 ప్రభాతవార్త:** మినీ వ్యాన్ ఢీకొని రోడ్డు దాటుతున్న వృద్ధురాలు మృతి చెందిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... పెద్ద అంబర్ పేటకు చెందిన కొమ్ము అలివేలు (60) శుక్రవారం మధ్యాహ్నం లక్ష్మారెడ్డి పాలెం సమీపంలో రోడ్డు దాటుతుండగా విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వస్తున్న మినీ వ్యాన్ ఆమెను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను హయత్ నగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించాగా చికిత్స పొందుతూ 3 గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్వామి వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్రెడ్డి

## కాంగ్రెస్ సభకు తరలిన నేతలు



సభకి వెళ్తున్న భాస్కర్రెడ్డి, ఉపేందర్రెడ్డి, గణేష్ నేత

**ఎల్బినగర్, జులై 4 ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి టీపీసీసీ సభ్యుడు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీప భాస్కర్రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా భాస్కర్రెడ్డి మాట్లాడుతూ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా సభకు హాజరవుతున్నారని తెలిపారు. ఆర్కేపురం, సరూర్నగర్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బస్ జెండాఊపి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం, సరూర్నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్నేత, బి.శంకర్యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధు, కిల్లమైసమ్మ చైర్మన్ సురేష్, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్నేత, వక్కలంక శ్రీనివాసరావు, ఎస్కే.మహమ్మద్, నల్లెంకి ధనరాజ్గౌడ్, బొడ్డుపల్లి మహీందర్, యాదవరెడ్డి, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లన్న, జ్ఞానేశ్వర్యాదవ్, శేఖర్ముదిరాజ్, కళ్యాణ్ యాదవ్, పగడాల శ్రీశైలం, పెద్దవూర సైదులు, రేణుక,మాధవి మమత, లావణ్య పాల్గొన్నారు.

### రామచందర్రావును కలిసిన నాచారం బిజెపి శ్రేణులు



అధ్యక్షులు రామచందర్ రావుకు జ్ఞాపికను అందజేస్తున్న మల్లెల నర్సింగ్ రావు తధితరులు

**నాచారం, జులై 4 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఇటీవల నియమితులైన ఎన్.రామచందర్ రావును శుక్రవారం నాచారం బిజెపి నాయకులు మల్లెల నర్సింగ్ రావుతో పాటు పాటు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు గా ఎనికైనా ఎన్. రాంచందర్ను బిజెపి అర్బన్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగరావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అంజి మాదిగ, బిజెపి సీనియర్ నాయకుడు ఐతగోని రమేష్ గౌడ్, యోగేష్, నాచారం డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్యకు నివాళి



దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం

**సరూర్నగర్, జూలై 4 ప్రభాతవార్త:** నిజాం నిరంకుశ పాలన, దొరల పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిరస్మరణీయుడని రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ అన్నారు. బాలాపూర్ మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఇక్కె సత్యనారాయణ కురుమ ఆధ్వర్యంలో బాలాపూర్ గ్రామంలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందంతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన దశరథ స్థానిక కురుమలతో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాంచెన్ దొర నీ కాల్మొక్కుతా.. అన్న బడుగు, బలహీన వర్గాల వారిలో చైతన్యాన్ని నింపి నిజాం నిరంకుశ రజాకార్లకు, ఆనాటి దొరలకు వ్యతిరేకంగా పోరాడిన కొమురయ్య బలిదానం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ నాయకులు దొడ్డి మల్లికార్జున్, చినింగి రమేష్, దేవరింటి వెంకటేష్, ఇక్కె వెంకటేశ్వర్, ఇక్కె శ్రీనివాస్, జెట్ట రవి, చిత్తాపురం బల్వంత్, కొండ్ర మల్లేష్, జెట్ట బాలప్ప, గుండ్ల కొమురయ్య, రావుల కొమురయ్య, జోరల సత్తయ్య, గొరిగె శ్రీశైలం, కందు శ్రీకాంత్, గుండ్ల రమేష్, ఇక్కె శ్రీశైలం, మేకల సత్తయ్య, కడారి పెద్దయ్య, మేకల బాబు, గొరిగె వెంకటేష్, నారి సత్యనారాయణ, చిన్నరావుల రవికుమార్, గడుసు సాయికుమార్ పాల్గొన్నారు.

## ఎస్ఐపై దర్యాప్తు జరపాలని డిసిపికి గిరిజన సంఘాల ఫిర్యాదు



డిసిపి చైతన్యకుమార్కు ఫిర్యాదు చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

**సైదాబాద్, జూలై 4 ప్రభాతవార్త:** సివిల్ వివాదంలో తలదూర్చి అక్రమంగా తనను పోలీస్ స్టేషన్లో నిర్బంధించి మానసికంగా వేధింపులకు గురిచేసిన సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి కృష్ణపై దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సింగరేణి కాలనీకి చెందిన సక్రిభాయితో పాటు పలువురు గిరిజన సంఘాల నేతలు శుక్రవారం సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి చైతన్య కుమార్కు ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తిని మధ్యవర్తిగా పెట్టుకుని సింగరేణి కాలనీలోని భార్యాభర్తల గొడవలు, ఆర్థిక లావాదేవిల వివాదాల్లో ఎస్ఐ జోక్యం చేసుకుంటూ బాధితులకు అన్యాయం చేస్తున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. డిసిపిని కలిసిన వారిలో సేవాలాల్ బంజార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతిలాల్ నాయక్, సేవాలాల్ బంజార సంఘం మహిళా అధ్యక్షురాలు సక్రిభాయి, మోహన్ నాయక్, హరినాయక్, మెహబూబ్, దస్రు నాయక్, వస్రం నాయక్ ఉన్నారు.